కథ

# మీరైతే ఏం చేస్తారు ?

- నందిరాజు పద్మలతా జయరాం

సరే! ఇప్పుడేమంటారు? "సాక్షాత్తూ రామచంద్ర మూర్తి కదా ఈ శ్రీరామచంద్రమూర్తీ, సత్య హరిశ్చంద్రుడూ, అమూల్ చాక్లెటు నోట్లోపెడితే కూడా చప్పరించనా, వద్దా అని ఆలోచించేంత అమాయకచక్రవర్తీ కదా! అలాంటి మంచి మారాజుకి విడాకులు ఇవ్వడానికి ఆ సీతామహాదేవి మనసెలా ఒప్పింది! బుద్ధిలేదూ! జ్ఞానంలేదూ! అసలు ఈ కలికాలం ఇంతలే!" లాంటి మాటలన్నీ అనేసి మీరు ఆ అమ్మాయికి తలంటెయ్యకండి. అవునండీ ! మాటల్ని వదిలేయడం మహాతేలిక. ఓసారిలా వచ్చి వాళ్ళ సంసారంలోకి తొంగి చూడండి. మీకే తెలుస్తుంది.

❀❀❀

ఆపసోపాలు పడుతూ, పడుతూ -లేస్తూ ద్రాక్షారామం నుంచి బయల్దేరింది ఆర్టీసీ వారి రథం. పదినిమిషాలకోసారి బస్సు ఆగుట, జనులు కిందికి దిగి దానిని తోయుట లాంటివి జరుగుతూ నిదానమే ప్రధానం అన్న సూక్తిని పాటిస్తోంది బస్సు.

అందరూ ఊటీకో, గోవాకో హనీమూన్ ట్రిప్ వేసుకుంటారు. కాస్త డబ్బూ, దస్కం వున్నవాళ్ళయితే ఏకంగా విదేశాలకి వెళ్ళి తేనె చంద్రుణ్ణి చూసి చక్కా వస్తారు. మన శ్రీరామచంద్రమూర్తి మాత్రం పెళ్ళవంగానే అన్నవరం, ద్రాక్షారామం, సింహాచలం యాత్రకి ట్రిప్ వేసుకున్నాడు. పోనీలే! పాపం ఇప్పుడిప్పుడే కదా పెళ్ళయిందీ, ఔను అంటే కాదనడానికి ఇంకా బోలెడు టైముంది కదా అని సీత కూడా సమాధానపడిపోయింది.

ఎవరో చెయ్యి ఎత్తేసరికి ఠక్కున ఆగింది బస్సు. ఓ గంగా భాగీరథీ సమానురాలు, సకుటుంబ సమేతంగా, ఆవకాయ జాడీలతో సహా బస్సులోకి వేంచేసింది. బస్సులో సీట్లన్నీ నిండిపోయాయి అప్పటికే.

"పెద్దమ్మగారూ! మీరిటొచ్చి కూచోండి" ఆవిణ్ణి చూడగానే వెనుక సీట్లో కూచున్న మూర్తి గార్తిగా కేకేశాడు.

సీత అలా నోరు తెరిచి చూస్తూ వుండగానే, మనవరాళ్ళతో సహా, అడ్డొచ్చిన జనవ్యూహాన్ని ఛేదించుకుంటూ వచ్చి ఆ సీట్లో చతికిలబడింది బామ్మగారు.

"అమ్మాయ్! ఆ కిటికీ దగ్గర పిల్లని కూచోబెడతాను కాస్త లేస్తావూ" అడిగింది.

"మరి నేనూ?" అడిగింది సీత

"పోనీ లేవద్దులే! కాస్త ముందుకి జరిగి కూచో చాలు" అని దయతలుస్తూనే, మనవరాల్ని కిటికీ దగ్గరకి తోసింది.

కాళ్ళ కింద పళ్ళ బుట్టలు, బట్టల సంచులు. అది చాలదన్నట్లు, "అమ్మాయ్! కాస్త ఈ జాడీ పట్టుకో. ఈ పిల్లది నా ఒళ్ళో కూచుంది కదా! కుదరడం లేదు." అంటూనే ఆవకాయజాడీ సీత ఒళ్ళో పెట్టేసింది బామ్మగారు.

సీతని మాట్లాడనివ్వకుండా అన్నాడు మూర్తి,

"అదెంతపని మామ్మగారూ! పట్టుకో సీతా" అన్నాడు డిమాండింగ్ గా.

మరో రెండు స్టేజీలు దాటేసరికి ఒడిలో అంతా జిడ్డుగా, తడిగా అనిపిస్తే చూసుకుంది సీత. చీరంతా ఒలికిన ఆవనూనె.

"అయ్యయ్యో ! మీ జాడీలో నూనె మొత్తం ఒలికిపోయింది. సారీ మామ్మగారూ! ఏం సీతా! ఆ మాత్రం జాగ్రత్తగా పట్టుకోవడం రాదూ! పాపం ఎంత నూనె వేస్టయిందో!" పెళ్ళాన్ని తిడుతూ, మామ్మగారిని ప్రాధేయపడసాగాడు మూర్తి.

బంగారం లాంటి చీర నాశనం అయి, తన పరువుపోయే పరిస్థితి వస్తే, ఆవిడ మీద జాలి చూపడం ఏవిటో, తనని కోప్పడటం ఏవిటో అర్థంకాక, మొగుడి మీద గొంతుదాకా కోపం వచ్చింది సీతకి.

ప్రయాణం బస్సయినా సరే, రైలయినా సరే ఎవరయినా నిల్చున్నట్లు కనిపిస్తే చాలు తన సీటు, భార్యసీటు కూడా దానం చేసి పారేసే ఈ మొగుడితో "ఛస్తే ఎక్కడికీ ప్రయాణం పెట్టుకోగూడదు బాబోయ్" అని ఒట్టేసుకుంది సీత.

❀❀❀

"అయ్యుయ్యో ! ఏంటండీ ఈ దెబ్బలూ!" కుంటుకుంటూ ఇంట్లోకి వస్తున్న భర్తని చూసి కంగారు పడిపోయింది సీత.

"ఏం లేదులే! ఆఫీసుకి బయల్దేరానా స్కూటర్ మీద! పాపం ఓ అమ్మాయి పసిపిల్లాణ్ణి ఎత్తుకుని నడుస్తోంది. అయ్యో పాపం అనిపించి "అమ్మాయ్! లిఫ్ట్ కావాలా" అన్నాను. ఓసారి ఎగాదిగా చూసి వెనుక ఎక్కింది. వాళ్ళ ఏరియా కనుక్కుని రోడ్డు మీద "దిగమ్మా" అన్నాను. "ఇంటిదాకా దింపండి. ప్లీజ్" అంది.

"ఒక్క నిమిషం వెయిట్ చెయ్యండి" అని చెప్పి ఇంట్లోకి వెళ్ళింది. ఏం చెప్పిందో ఏవిటో, ఆ పిల్ల తాలూకు ముగ్గురు మగవాళ్ళు బైటికి వచ్చి,

"ఆడపిల్ల కనిపిస్తే చాలు లిఫ్టుకావాలా! టైమెంత? వస్తావా? అంటూ వెధవ్వాగుడు వాగుతావురా రాస్కెల్" అంటూ ఇదిగో ఈ విధంగా సన్మానించారు" దీనంగా చెప్పాడు మూర్తి.

పరోపకారానికి ఓ అంతూ పొంతూ లేదన్నమాట. దారే పోయే వాళ్ళందరికీ ఎవడండీ మిమ్మల్ని సాయం చెయ్యమన్నదీ" కన్నీళ్ళు పెట్టుకుంటూ కాపు పెట్టింది సీత దెబ్బలకి.

❀❀❀

"హమ్మయ్య ! టికెట్లు దొరికాయండీ" ముఖం చాటంత చేసుకుని అంది సీత క్యూలోంచీ బైటికి వచ్చి.

అభిమాన హీరో సినిమా చూడాలని అప్పటికి రెండుసార్లు థియేటర్‌కి వచ్చి, టికెట్లు దొరక్క వెనక్కి మళ్ళాల్సివచ్చింది. ఈరోజు రెండు గంటల ముందు నుండీ పడిగాపులుపడితే దొరికాయి.

"పద! పద! ఆట మొదలయినట్లుంది" థియేటర్లోకి వెళ్ళబోతూ, ఠక్కున ఆగాడు మూర్తి, ఎవరో పిలిస్తే.

"ఒరేయ్ మూర్తీ ! అమ్మయ్య ! థాంక్ గాడ్ ! ఇక భయం లేదు. ఇదుగో మాధవీ! వీడే శ్రీరామచంద్ర మూర్తి. పరోపకారం కోసం ప్రాణాలొదిలేస్తాడు అని చెప్పలేదూ! వీడే" భార్యని పరిచయం చేశాడు మూర్తి ఫ్రెండ్ రాజుకి.

"దార్లో బండి ట్రబులిచ్చిందిరా! అందుకే లేటయింది. మా ఆవిడకి ఈ హీరో అంటే మహా క్రేజ్. ఇప్పటికి రెండుసార్లు చూసింది ఈ సినిమా. అయినా మళ్ళీ చూద్దామని గోల. లక్కీగా నువ్వు కనిపించావు" ఆనందంగా చెప్పాడు రాజు.

"కనిపిస్తే" అర్థంకాలేదు సీతకి.

"సీతా ! ఆ రెండు టికెట్లు వాళ్ళకిచ్చెయ్. తీస్కోరా రాజూ! మేం ఇంకోసారి చూస్తాంలే" అంటూనే సీత చేతిలోని టిక్కెట్లు లాక్కుని రాజు చేతిలో పెట్టాడు మూర్తి.

తెల్లముఖం వేసుకుని చూస్తోంది సీత.

" అరేయ్ మూర్తీ ! ఏమీ అనుకోకుండా ఓ వంద సర్దు. చెప్పానుగా అనుకోకుండా బండి ట్రబులిచ్చిందని, ఆ రిపేరుకి జేబులోకాపర్సు ఖాళీ అయిపోయినాయి. సినిమా నుంచి హోటల్‌కెళ్ళి భోంచేద్దామని మాధవి ప్లాన్. రేపిచ్చేస్తాలే !" రాజు అడగడం, జేబుల్లోంచి చిల్లరతో సహా వెతికి మూర్తి అతగాడికి ఇచ్చేయడం క్షణాల్లో జరిగిపోయింది.

చేతిలో చెయ్యి వేసుకుని హుషారుగా సినిమా చూడడానికి వెళ్తున్న రాజు దంపతుల్ని అలాగే చూస్తు నిలబడిపోయిన సీతతో,

"పాపం ముచ్చటగా మూడోసారి చూద్దాం అనుకుంటున్నారు. చూణ్ణీలే! పద పోదాం" అన్నాడు మూర్తి.

కన్నీళ్ళు ఆగలేదు సీతకి.

"మరి మనం మూడుసార్లు తిరిగితేగానీ, దొరకలేదు గదండీ టిక్కెట్లు. దాని సంగతేంటీ?" ఏడుపు ఆపుకుంటూ అడిగింది.

"అబ్బబ్బ ! పరోపకారం చెయ్యడం అంటే పాములా బుస్సుమంటూ లేస్తావు. చూడు నన్ను ఎంత బాగా పరిచయం చేసాడో రాజుగాడు భార్యకి. సర్లే! ఇహ పద. హాయిగా కబుర్లు చెప్పుకుంటూ నడుద్దాం ఏం?" భార్య భుజం చుట్టూ చెయ్యేసాడు మూర్తి.

ఆ చేతిని విదిలించేసింది సీత.

" ఏవిటండీ హాయి? అదొక్కటే తక్కువ నా ముఖానికి . వేరే వాళ్ళకి ఎక్కడ ఇబ్బందో అని సొంత వాళ్ళని ఇబ్బంది పెట్టే పిచ్చి మారాజుని మిమ్మల్నే చూశాను నా ఖర్మ. ఓ సినిమా లేదు. షికారులేదు. కొత్తగా పెళ్ళయిన వాళ్ళు ఎంచక్కా రెక్కలు మొలిచిన పిట్టల్లా తిరుగుతారు. నేనేమో ఇంటికొచ్చిన చుట్ట పక్కాలకి వంటలక్కలా తయారయ్యాను. ఎవడికి సిటీలో పని వుందని తెలిసినా, తమరు ఫోనుచేసి మరీ "మా ఇంటికి రండి. మా ఇంటికి రండి" అని వెంటబడితే, వాళ్ళు రాక ఛస్తారా! వాళ్ళు ఊరు చూడ్డానికెళ్తే నేను కారియర్లు కట్టియ్యడం, వాళ్ళ బట్టలుతకటం. మన బెడ్‌రూం వాళ్ళకి దానం చేసి, మనం హాల్లో చాపమీద పడుకోవటం. ఈ రకం దాతృత్వం నేనెక్కడా కనలేదు, వినలేదు. ఆర్నెల్లయింది పెళ్ళయి. కనీసం చార్మినార్ అయినా చూపించారా! బాబోయ్! నావల్లకాదు మీతో. ఇంక పొరపాటున కూడా మీతో ఎక్కడికీ రాను. ఆటో పిలవండి ఇంటికి పోదాం" ఇంతెత్తున లేచింది సీత.

"నా దగ్గర డబ్బులుంటేగా! రాజుగాడికి పావలాతో సహా ఊడ్చి ఇచ్చేశా. నీ దగ్గరుంటే సరే! లేకపోతే ఇంటిదాకా లెఫ్ట్ అండ్ రైటే" నిర్వికారంగా అన్నాడు మూర్తి.

❀❀❀

"పాతిక సంబధాలయినా చూసి వుంటారు కదూ ఆ పరిమళకి" అన్నం తింటూ అడిగాడు మూర్తి.

"పాతికేవిటీ! సెంచరీకి దగ్గర్లో వుంటేనూ. ముప్పయ్యయిదు దాటుతోంది వయసు. ఏవిటో! ఇన్నాళ్ళూ గొంతెమ్మ కోరికలు పెట్టుకుని, వచ్చిన సంబంధాలన్నీ తిరగ్గొట్టింది. ఇప్పుడు ఏదో అడ్జెస్టు అవుదామని నిర్ణయించుకుంటే కనీసం రెండో పెళ్ళివాడు కూడా దొరకడం లేదు. అంతా స్వయంకృతాపరాధం" చెప్పింది సీత.

సీతకి దూరపు బంధువు పరిమళ. ఆ పిల్లకి పెళ్ళి చూపుల కోసం హైదరాబాద్‌లో ఓ సంబంధం వెతికాడు మూర్తి. తమ ఇంట్లోనే ఆ కార్యక్రమం ఏర్పాటు చేశాడు. పెళ్ళి చూపుల తతంగం పూర్తి అయీ అవగానే వీళ్ళకి ఈ సంబంధమూ కుదరదు అని తేలిపోయింది. ఏడుస్తూ కూర్చున్న పరిమళని ఓదార్చి వాళ్ళకి పడకలు ఏర్పాటుచేసి పడుకున్నారు మూర్తీ, సీతా.

తెల్లారింది...

ముఖం కడుక్కుని స్టిక్కర్ అతికించుకుంటున్న సీత దగ్గరికి వచ్చింది పరిమళ తల్లి కామాక్షమ్మ.

"ఏం సీతా! నీకు ఇష్టమేనా!" అంది

"ఏవీ బొబ్బట్లేనా! అబ్బో ! నాకు మహా ఇష్టం. ప్చ్! చెయ్యడం మాత్రం రాదు", ఆవిడ చేతిలోని బొబ్బట్ల ప్లేట్‌ని చూస్తూ అంది సీత.

"అదెంత పని? పరిమళకి బ్రహ్మాండంగా వచ్చు. ఎంచక్కా ఇద్దరూ కలిసి చేసుకోవచ్చు. అది నేర్పుతుందిలే!" ఆనందంగా అంది కామాక్షమ్మ.

అర్థం కాలేదు సీతకి.

"అదేనమ్మా ! మీ ఆయన మూర్తి పరిమళని చేసుకుంటాను అన్నాడమ్మా - " నువ్వు పెద్ద మనసుగల దానివి. అభ్యంతరం పెట్టవు" అన్నాడు. పిల్లకి ఇంకా వయసు పెరిగితే ఎంత కష్టం? ఏదో ఒకటి చేసి ఆ బాధ్యత తీర్చుకోవాలనుకుంటున్నానమ్మా. మీ ఇద్దరూ హాయిగా కలిసి వంటచేసుకోవచ్చు. కలిసి మెలిసి వుండవచ్చు."

కామాక్షమ్మగారి మాటలు పూర్తికాకుండానే సుడిగాలిలా దూసుకుపోయి, మూర్తిని నిలదీసింది సీత.

"అవునోయ్! పాపం పెళ్ళికాని ఆడపిల్లకి ఈ సమాజంలో ఎంత అవమానభారమో తెలుసా! నువ్వూ ఆడదానివే కదా! ఆలోచించు. పాపం కదా అని నేను చేసుకుంటాలే" అని తేలిగ్గా అనేసాడు మూర్తి.

❀❀❀

ఊఁ.... ఇప్పుడు చెప్పండి. మీరయితే ఏం చేస్తారు? ఈ పిచ్చి మారాజుని, ఇప్పటికీ మంచి మారాజు అనే అంటారా! బాబోయ్ ! ఈ పరోపకారితో కాపురం. హమ్మో! నావల్ల కాదు. ఇప్పించెయ్యండి విడాకులు. ఎందుకంటే ఆ సీతమ్మ తల్లిని నేనే.

❀❀❀

**కవిత**

# పార్థివ క్రాంతి

-జి.యస్.యస్. సాయి

*తూరుపు ముంగిట నవ వర్షం*
*కల్లాపి చల్లితే...*
*ఉదయబింబం మెరిసింది రంగవల్లియై !*

*శిశిరపత్రంలా గత కాలం*
*రాలి పోతే....*
*నవతేజం చిగురించింది కొత్త ఆశయై !*

*ప్రకృతి ద్వారానికి పచ్చదనం*
*తోరణమైతే....*
*కోకిల గాత్రం పలికింది మంగళ గీతమై !*

*కోటి స్వప్నాలతో వసంత కన్య*
*నవ వధువులా*
*'చైత్ర' వారింట అడుగు పెడుతోంది....*

*శుభహారతిదే ఆమనిరాణికి !*
*సుస్వాగతమిదే పార్థివ క్రాంతికి !!*

